# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 14-05-2017**

బంగ్లాదేశ్ లో ప్రొఫెసర్ యూనస్ ఖాన్ పొదుపు ఉద్యమం చేపట్టినట్లు, ఎస్.కె. డే భారతదేశంలో పంచాయితీ రాజ్ ఉద్యమాన్ని తీసుకొచ్చినట్లు తెలంగాణలో రైతుకు స్వర్ణయుగం తెచ్చే మహోద్యమం రావాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. వ్యవసాయాభివృద్ధి కోసం, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ఇక మా భవిష్యత్తుకు ఢోకా లేదనే భరోసా రైతాంగంలో కలిగే విధంగా పాటలు రాయాలని, వీడియో చిత్రాలు రూపొందించాలని, రచనలు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఇప్పటికే రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు తెస్తున్నామని అవన్నీ సక్రమంగా అమలు చేసే బాధ్యతను రైతు సంఘాలకు అప్పగిస్తామని సిఎం వెల్లడించారు. రైతు స్వర్గయుగానికి రైతు సంఘాలే నిచ్చెన మెట్లు కావాలని, అవి నిజాయితీగా పని చేయాలని సిఎం కోరారు. వ్యవసాయం బాగు పడి, రైతు ధైర్యంగా ఉండడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టంగా ఉండడం కోసం చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల్లో చైతన్యం కలిగించాలని సిఎం కేసీఆర్ అభ్యర్థించారు.

ప్రగతి భవన్లో శనివారం పలువురు సినీ కవులు, సినీ దర్శకులు, కవులు, రచయితలతో ముఖ్యమంత్రి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం వారితో తెలంగాణలోని సమకాలీన పరిస్థితులు, వివిధ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, బంగారు తెలంగాణ దిశగా వేస్తున్న అడుగులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి చేపట్టిన పథకాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో జరిగితేనే విజయవంతమవుతాయి కాబట్టి, ప్రజలను చైతన్యవంతం చేసే విధంగా రచనలు చేయాలని కోరారు. వ్యవసాయాభివృద్ధి – రైతు సంక్షేమంపై ప్రధానంగా దృష్టి పెట్టిన ఈ సమావేశంలో నీటి ప్రాజెక్టులు, విద్యుత్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, హరితహారం, టిఎస్ ఐపాస్, ఐటి పాలసీ, గొర్రెల పెంపకం, చేపల పెంపకం, చేనేత పరిశ్రమ, ఆరోగ్య పరిరక్షణ, కేసీఆర్ కిట్, నవీన క్షౌరశాలల ఏర్పాటు, పేకాట క్లబ్బుల నియంత్రణ, గుడుంబా నివారణ, తదితర అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు.

దర్శకులు, కవులు, రచయితలు గోరటి వెంకన్న, చంద్రబోస్, అనంత శ్రీరామ్, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, ఎన్.శంకర్, సాగర్ చంద్ర, సంకల్ప్ రెడ్డి, ప్రేమ్ అన్నన్, ఉత్తేజ్, శ్రీనివాసరెడ్డి, దామోదర్, శివనాగేశ్వర్ రావు,

పరిపూర్ణాచారి, తరుణ్ భాస్కర్, లక్ష్మణ్, కందికొండ, వడ్డేపల్లి కృష్ణ, మిట్టపల్లి సురేందర్, అభినయ శ్రీనివాస్, కోదారి శ్రీను, యశ్ పాల్, నీల నర్సింహ, వరంగల్ శ్రీనివాస్ తదితరులు ఈ చర్చలో తమ అభిప్రాయాలను సిఎంతో పంచుకున్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సిఎం ఓ.ఎస్.డి. దేశపతి శ్రీనివాస్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంతరెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘‘తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధి కోసం, రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నది. పెట్టుబడి కోసం ఏటా ఎకరానికి రూ. 8 వేల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. 17 వేల కోట్ల పంట రుణాలకు మాఫీ పూర్తయింది. సాగునీటి రంగానికి ఏటా రూ. 25,000 కోట్లు కేటాయించింది. కోటి ఎకరాలకు సాగునీరు అందించే ప్రక్రియ ప్రారంభమయింది. రూ. 4800 కోట్లతో 24 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. మిషన్ కాకతీయతో 46000 చెరువుల పునరుద్దరిస్తున్నాం. 330 కొత్త గోడౌన్ల నిర్మాణం చేపట్టి, మొత్తం గోడౌన్ల సామర్థ్యం 21 లక్షల టన్నులకు చేర్చాం. క్రాప్ కాలనీల ఏర్పాటు విధానం అమలు చేస్తున్నాం. సబ్సిడీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాల పంపిణీ చేస్తున్నాం. ప్రతీ 5 వేల ఎకరాలకు ఒక వ్యవసాయాధికారిని నియమించాం. ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో మిని భూసార ప్రయోగశాల ఏర్పాటు చేస్తున్నాం. గిట్టుబాటు ధర కోసం వచ్చే ఏడాది నుంచి రూ. 500 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నాం. 12 లక్షల వరకు సాదా బైనామాల ఉచిత రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ప్రతీ ఏడాది వానాకాలం, యాసంగి పంటలకు సబ్సిడీపై విత్తనాల సరఫరా చేస్తున్నాం. సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణలో భాగంగా విత్తనోత్పత్తి కోసం సీడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటవుతున్నాయి. ప్రతి రైతు భూమిలో ఉచితంగా భూసార పరీక్షలు జరిపి భూసార ఫలితాల కార్డుల పంపిణి చేస్తున్నాం. కొత్తగా 2000 మంది వ్యవసాయ విస్తరణ అధికారుల నియమించాం. మైక్రో ఇరిగేషన్ ను ప్రోత్సహించడానికి ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బిసి, చిన్నకారు రైతులకు 90 శాతం, మిగతావారికి 80 శాతం సబ్సిడీ ఇస్తున్నాం’’ అని ముఖ్యమంత్రి వివరించారు.

‘‘రైతుకు కావాల్సింది సాగునీరు, విద్యుత్, సకాలంలో ఎరువులు, విత్తనాలు, పంట పండిన తర్వాత మార్కెట్లో గిట్టుబాటు ధర. ఇవి ఉంటే వ్యవసాయదారులకు ఏ సమస్య ఉండదు. వీటన్నింటిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వచ్చే ఏడాది నుంచి వర్షాకాలం, ఎండాకాలం పంటలకు ఎకరానికి నాలుగు వేల చొప్పున ఎనిమిది వేల చొప్పున అందిస్తున్నాం. ఇక తెలంగాణ రైతులకు పెట్టుబడి సమస్య ఉండదు. అందరూ ఒకే పంట వేసి నష్టపోకుండా క్రాప్ కాలనీలు ఏర్పాటు చేస్తాం. వ్యవసాయానుకూల వాతావరణ పరిస్థితులను బట్టి ఎక్కడ ఏ పంట వేయాలో ముందే నిర్ణయించి రైతులతో అవే పంటలు సాగు చేయిస్తాం. వాటికి గిట్టుబాటు ధర

వచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అన్ని విషయాల్లో రైతులకు అండగా ఉండడానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రైతు సంఘాలను ఏర్పాటు చేస్తాం. రైతు సంఘాలే ధర నిర్ణయించే పద్దతి తెస్తాం. రైతులు గిట్టుబాటు ధర కోసం ఇబ్బంది పడే పరిస్థితి ఇక ఉండదు. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలంటే రైతుల్లో అవగాహన పెరగాలి. ప్రతీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలి. అందుకోసమే ప్రజల్లో చైతన్యం రావాలి. వారిలో చైతన్యం తీసుకొచ్చేలా మీరు పాటలు రాయాలి. చిత్రాలు తీయాలి. రచనలు చేయాలి. రైతును నిలబెట్టేలా సహకరించండి'' అని ముఖ్యమంత్రి అభ్యర్థించారు.

''తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం ఆచరణాత్మక ధోరణితో పనిచేస్తున్నది. అందరూ ఒకేలా పంటలు వేసి నష్టపోకుండా మన అవసరాలు, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తాం. దాని ప్రకారమే రైతులు పంటలు వేసుకోవాలి. వ్యవసాయంలో యాంత్రీకరణ, ఆధునికీకరణ రావాలి. సూక్ష్మ సేద్యం అమలు చేయాలి. ఆధునిక పద్దతులు అవలంభించాలి. వీటి విషయంలో రైతులకు అవగాహన కల్పించేలా రచనలు చేయండి. తెలంగాణ ఉద్యమంలో ఆట-పాటది గొప్ప పాత్ర. ఇప్పుడు బంగారు తెలంగాణ నిర్మాణంలో కూడా అంతటి మహోన్నత పాత్ర పోషించాలి'' అని ముఖ్యమంత్రి అన్నారు.

కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు వ్యవసాయాభివృద్ధి-రైతు సంక్షేమం కోసం తాము రచనలు చేస్తామని, డాక్యుమెంటరీలు రూపొందిస్తామని సమావేశానికి హాజరైన ప్రముఖులు చెప్పారు. ఉద్యమ సమయంలో తాము రాసిన అనేక పాటలకు కేసీఆర్ స్పూర్తిగా నిలిచారని, ఆయన పాటలే పల్లవులుగా పాటలు రాశామని ప్రముఖ సినీ కవి సుద్దాల అశోక్ తేజ అన్నారు. తెలంగాణ ప్రజల బాగు కోసం కేసీఆర్ నిండు మనసుతో పనిచేస్తున్నారని, తాము కూడా అంతే నిండు మనసుతో ప్రజలకు ఉపయోగపడే పాటలు రాస్తామని సినీ గేయ రచయిత చంద్రబోస్ చెప్పారు. తాను దాదాపు అన్ని పార్టీలకు పాటలు రాశానని, టిఆర్ఎస్ పార్టీకి మాత్రం రాయలేకపోయానని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. కేసీఆర్ ఏదైనా చెప్తే మొదట అపోహలు ఏర్పడతాయని, తర్వాత ఊహలా అనిపిస్తుందని, తర్వాత ఉద్యమ రూపం తీసుకుంటుందని, చివరికి అదే ఊపిరిలా మారుతుందని, చివరికి నిజం అవుతుందని అనంత శ్రీరామ్ అన్నారు. తెలంగాణ సాకారం లాగానే ప్రభుత్వ పథకాలు కూడా విజయవంతం కావడానికి తాను పాటలు రాస్తానని ఆయన చెప్పారు. గ్రామాల్లో చెరువులు బాగుపడ్డాయని, ఊర్లు బాగుపడ్డాయని, పరిస్థితుల్లో మార్పు వచ్చిందని.. ఇదంతా పాటల్లో చూపిస్తామని ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన తన తండ్రి తెలంగాణ రాష్ట్రం రావాలని కోరుకున్నారని, తన తండ్రి కలను కేసీఆర్ నిజం చేశారని, కేసీఆర్ కలలు కంటున్న గొప్ప తెలంగాణ నిర్మాణంలో తాను పాలుపంచుకుంటానని దర్శకుడు, నటుడు ఉత్తేజ్ చెప్పారు. ప్రజల కోరికలను గమనించి, వారి అవసరాలను గుర్తించి, ఆ మేరకు కార్యక్రమాలు రూపొందిస్తున్నారని ప్రముఖ ప్రజాకవి గోరటి వెంకన్న అన్నారు. కేసీఆర్ తో కలిసి ఉద్యమంలో పనిచేసి అనేక

పాటలు రాశామని, అదే స్ఫూర్తితో ఇప్పుడూ పాటలు రాస్తానని వెంకన్న చెప్పారు. కేసీఆర్ తో సంభాషణ తమకో అధ్యయనంలా సాగిందని, కేసీఆర్ స్ఫూర్తితో, కేసీఆర్ ఆశిస్తున్న తెలంగాణను సాధించేందుకు తనవంతు పని చేస్తానని జాతీయ అవార్డు గ్రహీత తరుణ్ భాస్కర్ చెప్పారు. తానొక ఎలక్ట్రికల్ ఇంజనీర్ అని.. కరెంటు సమస్యలు తనకు తెలుసని, ఈ విషయంలో కేసీఆర్ అద్భుతం సృష్టించారని, కేసీఆర్ ఏమైనా సాధించగలరు అనడానికి ఇదో నిదర్శనమని సినీ దర్శకుడు సాగర్ చంద్ర అన్నారు.

త్వరలో జరగబోయే తెలంగాణ తొలి తెలుగు ప్రపంచ మహాసభలను గొప్పగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేయడంలో తెలంగాణ గొప్ప పాత్ర పోషించిందని, అదంతా మహాసభల్లో ప్రతిధ్వనించాలని సిఎం కోరారు.

**సిపిఆర్ఓ టు సిఎం**